# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

సోమవారం 28 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm


## ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఎస్ఎస్ఎంబీ29



సినిమా : మహేశ్‌బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబోలో ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిత్రబృందం దృష్టి అంతా ఎస్ఎస్ఎంబీ29కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులపైనే ఉంది. ఈనేపథ్యంలో రాజమౌళి తాజాగా పంచుకున్న ఓ ఫొటో ప్రస్తుతం వైరల్ గా మారింది. ఎడారి ప్రాంతంలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసిన రాజమౌళి 'కనుగొనడం కోసం తిరుగుతున్నా' అని దానికి క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన మహేశ్ సినిమా కోసం లొకేషన్స్ సెర్చ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే అప్‌డేట్ షేర్ చేయాలని అభిమానులు కోరుతున్నారు.ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త వైరలైన సంగతి తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఏఐ టెక్నాలజీని వినియోగించనున్నట్లు వార్తలు వినిపించాయి. దీనికోసం ఆయన ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెగ వైరలైంది. సినిమాలోని కొన్ని పాత్రలు, జంతువుల కోసం ఆయన ఏఐ టెక్నాలజీని ఉపయోగించనున్నారట. మాములుగానే రాజమౌళి సినిమాల్లో వీఎఫ్ఎక్స్‌లు భారీస్థాయిలో ఉంటాయి. ఇక ఈ సినిమాలో అవి రెట్టింపుగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

కేటీఆర్ నోటీసులకు ..

# బండి సంజయ్ సమాధానం

**ఆరోపణలన్నీ అవాస్తవం, నిరాధారం**

**వారంలోపు క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్**





హైదరాబాద్, ప్రజాస్వరం: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జారీ చేసిన లీగల్ నోటీసులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానమిచ్చారు. లీగల్ నోటీసులో కేటీఆర్ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని, నిరాధారమైనవని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని ఆయనకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ వ్యవహారాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ నోటీసులు ఇచ్చారు. వారంలోపు క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదన్నారు

# యువశక్తితో ఎన్నో అద్భుతాలు

**వికసిత్ భారత్ దిశగా ముందుకు**

**నగరంలో విద్యాభవన్ పాఠశాలలో రోజ్ గార్ మేళా**

**155 మందికి నియామక పత్రాలు అందజేత**

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ప్రజాస్వరం: యువశక్తి సాయంతో మనం ఎన్నో అద్భుతాలు చేయొచ్చు అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నగరంలోని భారతీయ విద్యాభవన్ పాఠశాలలో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఎంపికైన 155 మందికి నియామక పత్రాలు అందించారు. అనంతరం కిషన్‌రెడ్డి ప్రసంగించారు.**

"కేంద్ర విభాగాల్లో ఖాళీలు ఉండకూడదనే ప్రతి నెలా రోజ్‌గార్ మేళా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 9 లక్షల మందికి నియామక పత్రాలు అందించాం. ఇవాళ దేశవ్యాప్తంగా 51 వేల మందికి నియామక పత్రాలు అందిస్తున్నాం. వికసిత్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. వచ్చే 25 ఏళ్లపాటు మనకు అమృత కాలమని ప్రధాని మోదీ అంటారు. యువశక్తి సాయంతో మనం ఎన్నో అద్భుతాలు చేయొచ్చు. అనేక దేశాల్లో యువత తగ్గుతోంది.. మనవద్ద పుష్కలంగా ఉంది. ఇవాళ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. శాంతిభద్రతలు సరిగా లేకుంటే దేశంలోకి పెట్టుబడులు రావు. ఉగ్రవాద చర్యలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. వ్యవసాయ విధానాల్లో మార్పులు తెస్తున్నాం. విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. విద్యుదుత్పత్తి పెంచి అన్ని రంగాల అభివృద్ధికి సహకరిస్తున్నాం" అని కిషన్‌రెడ్డి అన్నారు. రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు.



## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి మోదీ కృషి : సంజయ్

వైజాగ్, ప్రజాస్వరం : తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఆంధ్ర .. స్టీల్ సిటీలోని వీఎంఆర్డీఏలో నిర్వహించిన రోజ్ గార్ మేళాలో ఆయన మాట్లాడారు. "ప్రధాని మోదీ రెండేళ్ల క్రితం రోజ్ గార్ మేళా ప్రారంభించారు. పది లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. రెండేళ్లలో 8 లక్షల మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. విశాఖపట్నంలో ఇంకా ఎంతో అభివృద్ధి జరగాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది మోదీ ప్రభుత్వమే" అని బండి సంజయ్ అన్నారు.


# సొంతగూటికి బాబుమోహన్

**టీడీపీలో చేరిన సినీనటుడు**

**స్వయంగా వెల్లడించిన యాక్టర్**

**హైదరాబాద్, ప్రజాస్వరం : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు నేతలు తమకు కలిసొచ్చే పార్టీలో జాయిన్ అవుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కీలక నేతలు కూడా ఎమ్మెల్యేల బాటలోనే హస్తం గూటికి చేరుకున్నారు. ఇక ఏపీలో టీడీపీ అధికారంలోకి రావటంతో తెలంగాణలో ఆ పార్టీ వైపు కూడా కొందరు నేతలు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాను టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు.**

తాజాగా మాజీమంత్రి, ప్రముఖ సినీ నటుడు బాబు మోహన్ టీడీపీ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆయన ఆ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అందుకు సంబంధించిన ఫోటోను బాబు మోహన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో బాబు మోహన్ మంత్రిగా పని చేయగా.. తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. తెలంగాణ లో టీడీపీని బలోపేతం చేసే దిశగా పసుపు పార్టీ అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ క్రమంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న బాబు మోహన్ ఆ పార్టీలో చేరినట్లు ప్రకటించారు.



## రూ.50 వేల కోట్ల ఐఫోన్ల ఎగుమతి



**ముంబయి, ప్రజాస్వరం : భారత్‌లో యాపిల్ ఐఫోన్ల తయారీ కేంద్రం వేగంగా ఎదుగుతోంది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో దాదాపు 6 బిలియన్ డాలర్లు ( రూ.50 వేల కోట్లకుపైగా) విలువైన ఐఫోన్లను ఎగుమతి చేసినట్లు కథనాలు వస్తున్నాయి. మొత్తంగా 2024 ఆర్థిక సంవత్సరంలో ఈ ఎగుమతులు దాదాపు 10 బిలియన్ డాలర్లను (సుమారు రూ.85వేల కోట్ల)ను దాటేయొచ్చని అంచనా. గతేడాది విక్రయాలతో పోలిస్తే ఇది మూడోవంతు వృద్ధి సాధించినట్లే.**

స్థానిక సబ్సిడీలు, నైపుణ్యం ఉన్న ఉద్యోగులను వినియోగించుకొని యాపిల్ భారత్‌లో ఐఫోన్ల తయారీ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. ఇటీవలకాలంలో అమెరికా-చైనా మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. దీంతో బీజింగ్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న ఐఫోన్ లక్ష్యాలను సాధించడంలో న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే యాపిల్‌కు ప్రధాన సరఫరాదారులుగా ఉన్న ఫాక్స్‌కాన్, పెగట్రాన్ సంస్థలు టాటా ఎలక్ట్రానిక్స్‌తో జట్టు కట్టాయి. ఫాక్స్‌కాన్ చెన్నై శివార్లలో అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేసింది. ఇక కర్ణాటకలోని టాటా గ్రూప్ ఫ్యాక్టరీ నుంచి ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యలో 1.7 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను ఎగుమతి చేశారు. ఈ ఫ్యాక్టరీని విస్ట్రాన్ నుంచి టాటాలు కొనుగోలు చేశారు. భారత్ నుంచి అమెరికాకు అత్యధికంగా ఎగుమతి అయ్యే రెండో సరకుగా ఐఫోన్ నిలిచింది. తొలి ఐదు నెలల్లో వీటి విలువ 2.88 బిలియన్ డాలర్లని ఫెడరల్ ట్రేడ్ మినిస్ట్రీ డేటా చెబుతోంది. మరోవైపు భారత మార్కెట్లో మాత్రం యాపిల్ ఫోన్లు 7శాతం వాటాను మాత్రమే దక్కించుకొంది. ఇక్కడ కొత్తగా రిటైల్ స్టోర్లను ప్రారంభించింది. తొలి స్టోర్‌ను న్యూదిల్లీలో ఆ సంస్థ ఈసీవో టిమ్‌కుక్ స్వయంగా ప్రారంభించారు. భారత్‌లో ఐఫోన్ల విక్రయాలు 2030 నాటికి 33 బిలియన్ డాలర్లకు చేరొచ్చని బ్లూమ్‌బెర్గ్ అంచనా వేసింది. భారత్‌లో యాపిల్ వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొంది.



## బాలికపై సామూహిక అత్యాచారం

**సిద్దిపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి**

**పోలీస్ కేసు నమోదు**

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. హుస్నాబాద్ పట్టణంలో ఇంటి ముందు ఆడుకుంటున్న మైనర్ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన గురించి బాలిక సోమవారం రాత్రి తన తల్లికి వివరించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. అత్యాచారం చేసిన ముగ్గురు యువకులు.. బాలిక ఉంటున్న కాలనీకి చెందినవారుగా గుర్తించినట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షలకు పంపినట్లు సీఐ తెలిపారు.

# పెద్దపల్లి జిల్లాలో విషాదం

**విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరు మహిళలు సజీవదహనం**



**పెద్దపల్లి, ప్రజాస్వరం:** పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన రామగిరి మండలం రాంనగర్‌లో అర్ధ రాత్రి చోటు చేసకుంది. ప్రమాదంలో గ్రామానికి చెందిన తల్లి, కూతుళ్లు కాలువల పోషమ్మ(65), గడ్డం కొమురమ్మ(45) సజీవ దహనమయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ఒకేసారి మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

# పెయిడ్ ఆర్టిస్టులతో కుట్ర?

**కాంగ్రెస్ మరింత వేధించవచ్చు**

**సిద్ధంగా ఉండండి అంటూ కార్యకర్తలకు మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు**

**హైదరాబాద్, ప్రజాస్వరం :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ వైఫల్యాలను, అవినీతిని ఎండగడుతున్నందుకు బీఆర్ఎస్ పార్టీ మీద వాళ్లు అసహనంతో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపడంలో మద్దతు పలికిన బీఆర్ఎస్ నాయకులు, సోషల్‌మీడియా వారియర్స్‌కు ఈ సందర్భంగా కేటీఆర్ ధన్యవాదాలు కేటీఆర్ తెలిపారు.గత రెండు రోజులుగా మనం చూసింది సుదీర్ఘమైన రాజకీయ కక్ష సాధింపుల ప్రహసనంలో తొలి అంకం మాత్రమే అని కేటీఆర్ అన్నారు. రానున్న రోజుల్లో అనేక విధాలుగా బురదజల్లేందుకు ప్రయత్నిస్తారని చెప్పారు. అందుకే ఈ కుట్రలు, వ్యక్తిగత దాడులు, అబద్ధపు ప్రచారాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అక్రమ కేసులు పెడతారని.. డీప్‌ఫేక్ టెక్నాలజీతో వీడియోలు వదులుతారని.. పెయిడ్ ఆర్టిస్టులతో నాటకాలు వేస్తారని కేటీఆర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలు తమ పెయిడ్ సోషల్‌మీడియా ట్రోల్స్ అందరూ మనపై దాడికి ఏకమవుతారని పేర్కొన్నారు. ఈ దాడులను చూసి ఆగం కావద్దని.. ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటంలో ఏ మాత్రం పక్కకు జరగవద్దని సూచించారు.తెలంగాణ ప్రజల బాగు కోసం మనం చేస్తున్న పోరాటాన్ని కొనసాగిద్దామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అవినీతి, అసమర్థత, ద్వంద్వ నీతిని ఎప్పటికప్పుడు బయటపెడదామని సూచించారు. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలులో రేవంత్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల ముందు పెట్టి ప్రజాక్షేత్రంలో శిక్షిద్దామని పిలుపునిచ్చారు.